ప్రజాశక్తి

సోమవారం 1 సెప్టెంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉక్కులో ఇఒఐలపై కార్మికాగ్రహం

మహాధర్నాలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం కూడలిలో మహాధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో విభాగాలను ప్రైవేటుకు అప్పగించేందుకు యాజమాన్యం ప్రకటించిన ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఇఒఐ)లపై కార్మిక వర్గం భగ్గుమంది. తక్షణం ఆ టెండర్లను రద్దు చేయాలంటూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కార్మికులు ఆదివారం కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద మహాధర్నా నిర్వహించారు. వారి కుటుంబ సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్ అధ్యక్షతన జరిగిన ఈ మహాధర్నాలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ చరిత్ర పోరాటాలతో ముడిపడి ఉందన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ కుట్రలు చేస్తున్న వారికి రానున్న కాలంలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ప్లాంట్‌లో ఇష్టానుసారంగా కార్మికులను తొలగించి, ఉన్న వారిపై పనిభారం పెంచడం దారుణమన్నారు. ఇటీవల మిగతా 2లో..

రోడ్డు ప్రమాదాల నివారణకు 'స్టాప్ అండ్ ఫేస్ వాష్'

వార్త 6లో..

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

▶ వార్త 2లో..

మహిళా చట్టాల అమల్లో విఫలం

▶ వార్త 5లో..



ఉక్కుపై వైసిపి ఉద్యమ కార్యాచరణ

రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుకు నిర్ణయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఎంతో ప్రతిష్టాత్మకమైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే క్రమంలో కూటమి ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ ఉద్యమ కార్యచరణ రూపొందించనున్నట్టు వైసిపి ప్రకటించింది. ఈ క్రమంలోనే ఒక రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయాలని, ఇతర పార్టీల నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. మద్దిలపాలెంలోని పార్టీ విశాఖ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షులు కెకె.రాజు అధ్యక్షతన జరిగింది. మాజీ మంత్రి, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను లూలూ మాల్, తదితర ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమ కార్యచరణ రూపొందించారు. జివిఎంసిలో వైసిపి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నటువంటి కార్పొరేటర్ల వార్డులలో అభివృద్ధి కార్యక్రమాల కోసం విశాఖ జిల్లా కలెక్టర్‌కు, కమిషనర్‌కు వినతి పత్రాలు ఇవ్వడం, పార్టీకి సంబంధించి బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని విభాగాలకు సంబధించిన కమిటీలు ఏర్పాటు చేయటం వంటి అంశాలపై చర్చించారు. సమావేశంలో మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, పసుపులేటి బాలరాజు, పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబూరావు, సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్, మొల్లి అప్పారావు, తిప్పల దేవన్ రెడ్డి, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మాజీ శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి, తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ మేయర్ కె.సతీష్, రవిరెడ్డి, కొండా రాజీవ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బొత్స

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 2న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం పర్యటన ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ కలిసి పరిశీలించారు. ముందుగా కోస్టల్ బ్యాటరీ వద్దగల హెలీప్యాడ్‌ను పరిశీలించి అక్కడ చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. హోటల్ నోవాటెల్ నందు మంగళవారం జరగబోయే ఈస్ట్ కోస్ట్ మారిటైం అండ్ లాజిస్టిక్ సమ్మిట్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి భాగస్వామ్యం కానున్నందున అక్కడ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. హెలీప్యాడ్ దగ్గర ముందస్తు చర్యలు, దుమ్ముధూళీ రేగకుండా వాటరింగ్ చేయడం, విఐపిల లిస్టు సిద్ధం చేసుకోవడం, నోవాటెల్ హోటల్లో మూడు చోట్ల సమావేశాల నిర్వహణ, ముఖ్యమంత్రి గ్రీన్ రూమ్ ఏర్పాటు, సీటింగ్, విఐపి ప్రోటోకాల్ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో డిసిపి అజిత, ఆర్‌డిఒ శ్రీలేఖ, జివిఎంసి ఎడిసి రమణమూర్తి, ఇపిడిసిఎల్ ఎస్ఇ శ్యాంబాబు, అగ్నిమాపక శాఖ అధికారి రేణుకయ్య, పోలీస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు విశాఖ రానున్నట్టు తెలుస్తోంది. ఆయన షెడ్యూల్ ఖరారు కావాల్సి ఉంది.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిపి, జెసి

మొదటి పేజీ తరువాయి..

ఉక్కులో ఇఒఐలపై కార్మికాగ్రహం

జరిగిన ప్రమాదాల్లో కార్మికులు మృతి చెందిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్లాంట్‌లో నేడు అస్తవ్యస్త పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సిద్ధమని ప్రకటించారు. పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ తమ విలువైన భూములను స్టీల్‌ప్లాంట్‌కు ఇచ్చిన నిర్వాసితులు తీవ్ర అన్యాయానికి గురయ్యారన్నారు. ఉపాధి దొరుకుతుందనే భరోసాతోనే వారు భూములను ఇచ్చారన్నారు. నేడు ఆ ఉపాధినే ప్రశ్నార్థకం చేస్తామంటే నిర్వాసితులతో పాటు కార్మిక వర్గం ఉపేక్షించదని హెచ్చరించారు. పోరాట కమిటీ ప్రతినిధి గణపతి రెడ్డి, ఐద్వా రాష్ట్ర నాయకురాలు పి.మణి తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఉదయం లేచింది మొదలు అభివృద్ధి సూత్రాలు వల్లిస్తారని, స్టీల్ ప్లాంట్‌లో లక్షల మంది ఉపాధి కోల్పోతుంటే ఆయనకు కనపడలేదా ? అని ప్రశ్నించారు. ధర్నాలో పోరాట కమిటీ ప్రతినిధులు యు.రామస్వామి, పి.శ్రీనివాసరాజు, వైటి.దాస్, జె.రామకృష్ణ, పివి.రమణమూర్తి, శ్రీనివాస్, జిఆర్‌కె.నాయుడు, సిహెచ్.సన్యాసిరావు, దొమ్మేటి అప్పారావు, ఎన్.రామారావు, డివి.రమణారెడ్డి, కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, వంశీకృష్ణ, మాజీ కార్పొరేటర్ విమల, ఐద్వా నాయకులు కె.వేణు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి చీఫ్ ఇంజినీర్‌గా సత్యనారాయణ రాజు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : రాష్ట్రంలో పట్టణ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్‌లో 11 మంది పర్యవేక్షక ఇంజినీర్లకు చీఫ్ ఇంజినీర్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో జివిఎంసిలో ఎస్ఇలుగా పనిచేస్తున్న పివివి.సత్యనారాయణ రాజు, వై.కృష్ణారావులకు సిఇలుగా ఉద్యోగోన్నతి దక్కింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. జివిఎంసిలో ప్రస్తుతం ఇన్‌ఛార్జి చీఫ్ ఇంజినీర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్ఇ జివి.పల్లంరాజుకు సిఇగా ఉద్యోగోన్నతి లభించలేదు. దీంతో జివిఎంసిలో ఖాళీగా ఉన్న చీఫ్ ఇంజినీర్ పోస్టుకు పివివి.సత్యనారాయణ రాజును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జివిఎంసిలో అనేక ప్రాజెక్టులు, నీటి సరఫరా విభాగం, పబ్లిక్ వర్క్స్, స్మార్ట్ సిటీ విభాగాలను సమర్థవంతంగా సత్యనారాయణ రాజు నిర్వహించడంతో ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు ఆయననే సిఇగా విశాఖలో నియమించాలని భావించడంతో ఆ అవకాశం దక్కింది. ఉద్యోగోన్నతి పొందిన మరో సిఇ వై.కృష్ణారావును ఎపి టిడ్కో చీఫ్ ఇంజినీర్‌గా నియమించారు. అక్కడ సిఇగా పని చేస్తున్న కె.వేణుగోపాల్‌ను స్వచ్ఛంద కార్పొరేషన్ సిఇగా డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో పి.సత్యనారాయణ, సిహెచ్.ధనుంజయ్, ఎంసిహెచ్.కోటేశ్వరరావు, ఎ.సుధాకర్, వై.కృష్ణారావు, బి.శ్రీనివాసరావు, డి.వేణుగోపాల్, ఎం.గణేష్ బాబు, బి.నరసింహమూర్తి, ఇ.రాజేంద్ర కృష్ణ, పివివి.సత్యనారాయణ రాజు ఉన్నారు.

సత్యనారాయణరాజు

అవార్డు అందుకుంటున్న గణేష్ బాబు

గణేష్ బాబుకు తెలుగు తేజం అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దొండపర్తి ప్రాంతానికి చెందిన కొండపి ఎస్‌వి.గణేష్ బాబుకు తెలుగు తేజం అవార్డు దక్కింది. తెలుగు వాడుక భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నరసరావుపేట భువనచంద్ర టౌన్ హాల్‌లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా డాక్టర్ శాంతాభాయి అధ్యక్షతన తెలుగు తేజం అవార్డు మహోత్సవం చేపట్టారు. గణేష్ బాబుకు తెలుగు తేజం అవార్డును నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందకుమార్ అందజేశారు. గణేష్ బాబు ఇప్పటి వరకు తెలుగు భాషలో 30 గ్రంథాల ముద్రణకు, మరుగునపడిన పాత గ్రంథాల పునరుద్ధరణకు తన స్వార్జిత ధనంతో సహాయం అందించారు. అంతేకాకుండా సంపాదకునిగా పలు గ్రంథాలకు వ్యవహరించారు. తెలుగులోనే మాట్లాడుతూ, తెలుగు భాష ప్రాముఖ్యతను ఎలుగెత్తి చాటుతున్నందుకుగాను శ్రీశ్రీ కళావేదిక వారు ఆయనను అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా గణేష్ బాబు మాట్లాడుతూ తెలుగు భాషకు సేవ చేయడం అంటే కన్న తల్లిదండ్రులు సేవే అని, దేశ సేవ అని తెలిపారు.

కుటుంబీకుల చెంతకు మహిళ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వ్యక్తి చేతిలో మోసపోయిన మహిళ ఎయుటిడి సంస్థ సహకారంతో తిరిగి కుటుంబీకుల చెంతకు చేరింది. వివరాల్లోకి వెళ్తే.. కాకినాడకు చెందిన వివాహిత సంధ్యను భర్త వదిలేసి వెళ్ళిపోయాడు. దీంతో వేరొకరి ఇంట్లో పని చేసుకుంటూ ఆమె పిల్లల్ని చదివిస్తోంది. పని ఇప్పిస్తానన్న ఒక దళారీ చెప్పుడు మాటలు విని ఆమె వైజాగ్ వచ్చింది. అతను మహిళను, ఆమె ఇద్దరు పిల్లలను ఆర్‌కె బీచ్‌లో వదిలి వెళ్లి పోయాడు. అటుగా వెళు తున్న స్థానిక మహిళ వారిని గమనించి సమాచారం ఇచ్చిందని ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. దీంతో తమ సంస్థ సిబ్బంది బీచ్ వద్దకు వెళ్లి ఆమెను పిల్లలతో సహా నిరాశ్రయుల షెల్టరుకి తీసుకొచ్చి వసతి కల్పించారన్నారు. తరువాత చైల్డ్ లైన్ దేవిని రప్పించి, కౌన్సిలింగ్ ఇప్పించామన్నారు. అనంతరం షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో తల్లీ పిల్లల్ని కాకినాడకు పంపించినట్టు తెలిపారు.

వాసుపల్లి విరాళం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 36 వ వార్డు రంగిరీజు వీధిలో ఆర్‌ఆర్ బాయ్స్ ఆధ్వర్యంలో జరగనున్న అన్నదానానికి మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైసిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.5 వేలు విరాళం అందజేశారు. ఆదివారం ఆశీలమెట్ట కార్యాలయంలో నిర్వాహకులకు సొంత నిధులతో తన వంతు సాయం అందజేశారు. కార్యక్రమంలో సౌత్ వేవ్స్ వింగ్ ప్రెసిడెంట్ కాకి పద్మ, 36 వ వార్డ్ ప్రెసిడెంట్ మహమ్మద్ షకిల్, జిల్లా బిసి సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల చికిత్సపై శిక్షణ

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ: భారతదేశంలో వైద్యుల నైపుణ్యాలను పెంపొందించేందుకు మెడికవర్ హాస్పిటల్స్, ఒలింపస్ మెడికల్ సిస్టమ్ సంయుక్తంగా ప్రగతిశీల శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించాయి. దేశవ్యాప్తంగా పల్మనాలజీ నిపుణులకు అత్యాధునిక శిక్షణ అందించడాన్ని లక్ష్యంగా శిక్షణ నిర్వహించారు .ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో కీలకమైన టెక్నాలజీపై వైద్యులకు సుదీర్ఘమైన సిద్ధాంత, ప్రాయోగిక పరిజ్ఞానం అందించారు. మెడికవర్ పల్మనాలజిస్టులు డాక్టర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ సుధీర్‌తాలే పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE III ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT VISAKHAPATNAM
O.S.1302/2024

Between:
M/s. Karur Vysya Bank, Pedawaltair Branch,
Visakhapatnam, Rep. by its Branch Manager ...Plaintiff
And:
M/s.Gruhapriya Enterprises & another ...Defendants

SUMMONS

To
R-1:M/s. Gruhapriya Enterprises,
Rep. by its Proprietrix
Smt. Thunugutlla Jyhothi, W/o.
Shri Thunuguttla Venkata Prasad,
D.No.5-124-8, Ground floor,
Lakshminagar, Pragathi Nagar,
Pendurthi, Visakhapatnam.
R-2:Thunuguntlla Venkata Prasad,
S/o T. Satyanandam, R/at D.No.211,
Akshya Pebbles Bay, China Waltair,
Near Kotak School,Opp More Super Market, Visakhapatnam-17.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you. You are hereby summoned to appear in the above Court in person or through an Advocate duly instructed and the matter stands posted to **16-09-2025 at 10:30 A.M.**, for your appearance, in default of your appearance on that day the suit will be heard and determined in your absence basing on the material available in the Court.

G. GEETA VARA LAKSHMI,
Advocate, Visakhapatnam
Cell: 9440275275.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT : VISAKHAPATNAM
I.A.2826/2024 in A.S. /2025

Between:
Koilada Vara Prasad ...Appellant/Petitioner
And
1) M. Rama Chandra Rao
2) M. Kesava Chandra
3) V. Lakshmi
4) Yedla Rani
5) M. Dhana Lakshmi (Died) ...Respondents/Respondents

NOTICE

To,
R-4: Yedla Rani, W/o. Srinivas, Hindu, Aged 42 years, R/at D.No.53-31-1/6/1, K.R.M. Colony, Backside of Burial Ground, Seethammadhara, Visakhapatnam.

Please take notice that the above I.A.2826/2024 in A.S. /2025 on the file of above Hon'ble Court is posted to **16-09-2025** for your appearance before the above Hon'ble Principal District Judge Court, Visakhapatnam at **10:30 A.M.** You have to appear in person or through an Advocate. In case if you fail to appear before the Hon'ble Principal District Judge Court, Visakhapatnam on **16-09-2025**as stated above, the matter may be heard exparte.

(By Order of the Hon'ble Court)
Tenneti Surya Bagavanulu
Tenneti Padmavathi &
B. Chaya Kumari,
Advocates, Visakhapatnam.

మహారాజశ్రీ ఏడవ (VII) అదనపు జిల్లా జడ్జి కోర్టు, విశాఖపట్నం
E.P. 3/2017 in O.S. 621/2014

బిట్వీన్
శీరం శ్రీనివాసరావు & అదర్స్ ...డి.హెచ్.ఆర్స్
అండ్
తాడి అప్పలనర్సమ్మ (లేటు),
తాడి వీర మోహనరావు & 3 అదర్స్ ..జె.డి.ఆర్స్

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా ఈదిగువ వివరించిన ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్థిని శ్రీ కోర్టువారు ఉత్తర్వుల మేరకు **తేది. 15-09-2025 ఉ॥గం॥10.30 ని॥ ల నుండి సా॥ 5 గం॥లలోపు** వేలం వేయుటకు ఉత్తర్వులు జారీ అయినందున సదరు వేలంలో పాల్గొనదలచినవారు పైకోర్టులో పైన చెప్పబడిన తేదిన హాజరై వేలంలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు ఆస్థి: విశాఖపట్నం జిల్లా, గాజువాక సబ్ రిజిస్ట్రార్, గొల్లపాలెం గ్రామం, శ్రీహరిపురం విస్తీర్ణం: 48చ॥గ॥, అసెస్‌మెంట్ నెం.76137A సర్వే నెం. 28P, డోర్ నెం. 62-8-3/2 గా గల జి+2 ఆర్.సి.సి. స్లాబ్.

ఇంటికి హద్దులు: తూర్పు: వీరికి మరియు టి. వీర్రాజు గారి ఇంటి మధ్య జాయింట్ కాంపౌండ్ వాల్, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:**రోడ్డు, **దక్షిణం:** కె. పైడమ్మ గారి స్లాబ్ ఇల్లు.

డిక్రీ హోల్డర్‌గారి ఉజ్జాయింపువిలువ రూ.19,00,000/-
కోర్టు అమీనుగారి ఉజ్జాయింపువిలువ రూ.19,00,000/-

(By Order of the Hon'ble Court)
VENNELA ESWARA RAO
M.V. SASHI BHUSHANA RAO
Advocates, Visakhapatnam. **Cell: 9848142151**

ప్రభుత్వ భూముల్లో ఆగని ఆక్రమణలు

టోల్‌గేట్ వద్ద నిర్మించిన ఒక షాపు

- టోల్‌గేట్ వద్ద షాపుల నిర్మాణం
- రూ.లక్షల్లో అడ్వాన్సులు, నెలవారీ అద్దె వసూళ్లు

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని తర్లువాడ రెవెన్యూ పరిధిలోని జాతీయ రహదారి పక్కన టోల్‌గేట్ సమీపంలోని సర్వే నంబర్ 191లో ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తారాస్థాయికి చేరాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది వ్యక్తులు ఇష్టానుసారంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి, వాటిల్లో షెడ్లను నిర్మించి, వాణిజ్య అవసరాలకు అద్దెకు, లీజుకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఆక్రమిత స్థలంలోని షెడ్లలో దుకాణాలు వేసుకునేందుకు రూ.లక్ష వరకు అడ్వాన్స్‌తోపాటు నెలకు రూ.8 వేలు వరకు అద్దె వసూలు చేస్తూ అదో రకమైన దందా నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి పక్కన స్థలాలు వాణిజ్యపరంగా కీలకం కావడంతో కొందరు ఈ స్థలాలను ఆక్రమించుకుని, తమ పలుకుబడిని ఉపయోగించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలున్నాయి. ఇటీవలే కూటమి పార్టీకి చెందిన ఒక వ్యక్తి రాత్రి వేళల్లో గెడ్డలను కప్పించి, అదే స్థలం తమ సొంతమని అందరినీ నమ్మించి అక్కడ షాపుల నిర్మాణం చేపడుతున్నాడని అంటున్నారు. రెవెన్యూ అధికారులు గతంలో హెచ్చరిక బోర్డులో ఏర్పాటుచేసినా బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాలకు పూనుకుంటున్నాడని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అశోక్‌గజపతిరాజుకు స్వాగతం పలుకుతున్న విష్ణుకుమార్ రాజు తదితరులు

గోవా గవర్నర్‌కు స్వాగతం

ప్రజాశక్తి-సీతమ్మధార : గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు ఆదివారం విశాఖపట్నం విచ్చేసిన సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, మహారాజా బ్యాంక్ చైర్మన్ ఎంఆర్‌కె.రాజు, మహారాజా మెడికల్ కాలేజీ చైర్మన్ బాబి స్వాగతం పలికారు.

ఎంఆర్‌పికే ఎరువులు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలో యూరియా విక్రయాల్లో ఎంఆర్‌పి ధరలకు మాత్రమే ఎరువుల డీలర్లు అమ్మాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం వెంకటాచలం ఆదేశించారు. ఇతర ఎటువంటి ఉత్పత్తులు బలవంతంగా ఇవ్వకూడదని తెలిపారు. రైతు ఇష్టపడి దుబ్బు గుళికలు అడిగితే మాత్రమే ఇవ్వాలి తప్ప, దుబ్బు గుళికలు కొంటేనే యూరియా బస్తా ఇస్తానంటే చర్యలు తప్పవని, లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా శ్రీరాధాష్టమి ఉత్సవాలు

ప్రజాశక్తి - ఆనందపురం : గంభీరం ఐఐఎం రోడ్డులోని హరే కృష్ణ వైకుంఠంలో శ్రీ రాధా మదన్ మోహన్ మందిరంలో హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యాన శ్రీ రాధాష్టమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. రాధాష్టమి సందర్భంలో ప్రత్యేక ఆకర్షణగా పూల అలంకరణ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భక్తదాస, యదురాజ దాస, డాక్టర్ అముక్తమాల్యద పాల్గొన్నారు.

7న అయ్యప్ప ఆలయం మూసివేత

ప్రజాశక్తి-పెందుర్తి : ఉత్తరాంధ్ర శబరిమలగా పేరొందిన పెందుర్తిలోని అయ్యప్ప స్వామి ఆలయాన్ని చంద్రగ్రహణం కారణంగా ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం 12:30 లోపు నిత్య విధులు కైంకర్యం ముగించి తర్వాత మూసివేస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రకటన విడుదలచేసింది. 8వ తేదీన 8 గంటల తర్వాత భక్తులకు యథావిధిగా దర్శనాలు ఉంటాయని పేర్కొంది.

గతుకుల రోడ్డుకు మోక్షమెప్పుడో..

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని తాళ్లవలస గ్రామ పంచాయతీ గొల్లల తాళ్లవలస రోడ్డు గతుకుల మయంగా ఉంది. సంబంధిత రోడ్డు నుంచి పిహెచ్‌సికి ఆనుకుని దొరతోట రోడ్డు వరకు గతుకులతో నిండి ఉంది. అడుగడుగునా గుంతలు ఉండడంతో సంబంధిత రోడ్డుపై ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణం ఇబ్బందికరంగా ఉందని స్థానికులు అంటున్నారు. ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనం, ఆటోలపై ప్రయాణంతో ఒళ్లు హూనం అవుతుందని ప్రయాణికులు వాపోయారు. వర్షం కురిస్తే ఆయా గుంతల్లో నీరు చేరి అటుగా నడిచి వెళ్లే వారిపై బురద నీరు తుల్లడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత రోడ్డును పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

గతుకుల మయంగా గొల్లల తాళ్లవలస రోడ్డు

అవంతిలో ముగిసిన వర్క్ షాప్

వర్క్ షాప్‌లో పాల్గొన్న విద్యార్థులతో అధ్యాపకులు

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ అంశంపై ఈ నెల 28వ తేదీన ప్రారంభమైన వర్క్ షాప్ ఆదివారంతో ముగిసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ విభాగం ఇండియన్ సర్వర్స్‌తో కలిసి బిటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు హాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఇచ్చారు. సరికొత్త ఆలోచనలకు, నూతన ఒరవడులకు, నైపుణ్యానికి ఈ కార్యక్రమం వేదికగా నిలిచిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ట్రైనర్‌గా ఇండియన్ సర్వర్ సిఇఒ డాక్టర్ సాయి సతీష్ వ్యవహరించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ విభాగాధిపతి పి.శ్రీలక్ష్మి, టి.పరమేష్, పి.లావణ్య, వై.దీప్తి సమన్వయ కర్తలుగా వ్యవహరించారు.

నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గత ప్రభుత్వ హయాంలో నాడు -నేడు పథకం కింద ప్రారంభించిన రెండు అదనపు తరగతి గదుల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అదనంగా నిధులు మంజూరు చేసి ఉంటే వాటి నిర్మాణం పూర్తయి ఉండేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1924లో స్థాపించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమిష్టి కృషి ఫలితంగా పాఠశాలలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. అందుకు తగ్గట్టుగా సౌకర్యాలు లేని పరిస్థితి ఉంది. గతేడాది విద్యా సంవత్సరంలో 220 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో ఈ ఏడాది 330కి చేరింది. ఇందులో 195 మంది బాలురు, 135 మంది బాలికలు చదువుతున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఎ, బి సెక్షన్లుగా విభజించి బోధిస్తున్నారు. బాలికలకు ఇప్పుడున్న టాయిలెట్లు సరిపోక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అదనంగా నిధులు మంజూరు చేసి అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అర్థాంతరంగా నిలిచిన అదనపు తరగతి భవన నిర్మాణం

నేరాలు ఘోరాలు

యువకుని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పి. భీమవరం గ్రామానికి చెందిన కంఠంరెడ్డి ధనసాయి (19) అనే యువకుడు ఆదివారం బంగారుమెట్ట గ్రామంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. యువకుని ఆరోగ్యం విషమంగా ఉండడంతో వైద్యానికి విశాఖ కెజిహెచ్‌కు తరలించారు వివరాలివి. పి.భీమవరానికి చెందిన ధనసాయి బంగారుమెట్టలోని తన అమ్మమ్మ గారి ఇంట్లో ఉంటూ ఎలక్ట్రీషన్ పనులు చేస్తూ ఉంటాడు. కొద్దిరోజులుగా వడ్డాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యుత్ పనులకు వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడి విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో శనివారం బాలికల తల్లిదండ్రులతోపాటు హెచ్‌ఎం కూడా మందలించి ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఆదివారం ఉదయం గ్రామంలోని పురుగుల మందు షాపు వద్ద గడ్డి మందు కొనుగోలు చేసి తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న ధనసాయిని కుటుంబీకులు విశాఖ కెజిహెచ్‌కు తరలించగా వైద్యం పొందుతున్నాడు.

రైలు నుంచి జారిపడి అంధునికి గాయాలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్: రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడడంతో అంధుడైన వ్యక్తి తీవ్రగాయాలైన ఘటన అనకాపల్లిలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలివి. ఆదివారం ఉదయం గోదావరి రైలులో వెళుతున్న విజయనగరం జిల్లా భోగాపురం గ్రామానికి చెందిన డి .రామప్పడు అనే అంధుడు, శంకరం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు రైలు వచ్చేసరికి, ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి కిందకు పడ్డాడు. సమాచారం అందుకున్న ఆర్‌పిఎఫ్ పోలీసులు, ప్రమాదంలో గాయాలైన రామప్పడును స్థానిక ఎన్‌టిఆర్ ఆసుపత్రికి వైద్యసేవలకు తరలించారు. ప్రమాద సమాచారాన్ని బాధితుడి బంధువులకు ఆర్‌పిఎఫ్ పోలీసులు, ఆసుపత్రి సిబ్బంది సమాచారం అందించారు.

వృద్ధుని అదృశ్యం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని పి.భీమవరం శివారు శ్రీరాంపురానికి చెందిన పాతరపల్లి ఈశ్వరరావు అనే వృద్ధుడు కొద్దిరోజులుగా కనిపించడం లేదని ఆదివారం కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఆచూకీ తెలిపిన వారు బుచ్చయ్యపేట పోలీస్ స్టేషనుకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

పట్టుబడిన జూదరులతో పోలీసులు

జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి -యంత్రాంగం

కశింకోట : స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని చెరకం, అడ్డం గ్రామాల పరిసర ప్రాంతాలలో జూదం ఆడుతున్న 10 మందిని ఆదివారం పోలీసులు పట్టుకున్నారని సీఐ అల్లు స్వామినాయడు తెలిపారు. జూదరుల నుంచి 52 పేకాట కార్డులు, రూ.61, 300 నగదు, నాలుగు బైకులు, తొమ్మిది మొబైల్ ఫోన్లు, ఆటో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ పి. మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ సూర్యరావు, కానిస్టేబుళ్లు డి. గోపి, నర్సింహమూర్తి, బి. శ్రీను, రాజశేఖర్, రామిరెడ్డి పాల్గొన్నారు. సంఘ వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

ఆనందపురం : ఆనందపురం మండలం బంటుపల్లి కల్లాలలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ శివ ఆధ్వర్యాన పోలీసులు దాడి చేశారు. ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదాని గంగవరం పోర్టు కాలుష్యంపై ధర్నా

ప్రజాశక్తి- గాజువాక : అదాని గంగవరం పోర్టు కాలుష్యం నివారించి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతూ, గాజువాక వై.జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రజల ఆదివారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, గంగవరం పోర్టు కాలుష్యం వల్ల నవాజ్ అపార్ట్‌మెంట్, రామచంద్రనగర్, స్వతంత్రనగర్, రిక్షా కాలనీ, సుందరయ్య కాలనీ, కణ్ణవానిపాలెం, దుర్గానగర్ పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అనారోగ్యాలపాలై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక ఎమ్మెల్యే వెంటనే చొరవ చూపి, యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నవాజ్ అపార్ట్‌మెంట్ వాసులు మాట్లాడుతూ, ఎన్నో ఆశలతో తాము ఫ్లాట్లు కొనుక్కుంటే, పోర్టు కాలుష్యం వల్ల ఉండలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. పెద్ద పెద్ద వాహనాలు, ఈ రోడ్డు మార్గంలో వెళ్లడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, రాత్రి 7 గంటలు దాటితే, బయటకు రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుందని తెలిపారు. ఈ ప్రాంతంలో అనధికారికంగా లారీలు పార్కింగ్ చేయటం వల్ల రాత్రిపూట దొంగతనాలు కూడా జరుగుతున్నాయని చెప్పారు. ఈ సమస్యలను

వై జంక్షన్ వద్ద ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు

గతంలో స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, 76వ వార్డు కార్పొరేటర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం మార్గం లేదన్నారు. పోర్టు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రోడ్డను కనీసం నీటితో తడిపే కార్యక్రమం కూడా చేపట్టడం లేదని తెలిపారు. సర్వీస్ రోడ్డు మార్గం ద్వారా వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో రావడంతో ఇటీవల ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు వెంటనే స్పందించి పరిష్కారం చేయకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నప్పటికీ సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బి.రమణ, లక్ష్మీ, కిరీటం, నవాజ్ అపార్ట్‌మెంట్ వాసులు, అశోక్, భార్గవ్, ఆనంద్, ప్రజలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని ఏపి ఆటో డ్రైవర్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆదాయం కోల్పోయిన ఆటోలు, వ్యానులు, జీపు డ్రైవర్లకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అక్కయ్యపాలెం హైవే జంక్షన్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీజిల్, పెట్రోలు, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్డు ట్యాక్స్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువులు, వాహన విడిభాగాలు, టోల్‌ప్లాజా ఫీజులు తదితరాలను కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భారీగా పెంచి డ్రైవర్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని మండిపడ్డారు. స్వయం ఉపాధితో జీవిస్తున్న డ్రైవర్లపై ఆర్థిక భారాలు వేస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు చేయాలని డ్రైవర్లకు పిలుపునిచ్చారు. డ్రైవర్ల ఆదాయానికి గండి కొట్టే ఓలా, ఊబర్, రాపిడో వాహనాలకు ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆటో అండ్ మోటార్ వాహన డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థిక సహాయం చేస్తామన్న ఇచ్చిన హామీను వెంటనే అమలు చేయాలని కోరారు. కాంపౌండ్ ఫీజులు పెంచే 21, 31 జిఒలను రద్దు చేయాలని, డ్రైవర్లకు పిఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని, వాహన విడిభాగాల ధరలపై వేసిన 18 శాతం జిఎస్‌టి రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రవికృష్ణ, కేలం, శివ, కె.నూకరాజు, జి.నందీశ్వరరావు, శంకర్, సిహెచ్ శ్రీనివాసరావు, వి.సన్యాసిరావు, నర్సింగు ఈశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాహనం ఖరీదు వాపస్ చేయాలి

ప్రజాశక్తి- లీగల్ న్యూస్ : వాహనం ప్రమాదానికి గురైనప్పుడు బీమా కలిగి ఉంటే నష్టపరిహారాన్ని కంపెనీ చెల్లించాలని నగరంలోని రెండవ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షులు గేదెల వెంకటేశ్వర్లు, సభ్యులు పి.విజయదుర్గ, కరకు రమణబాబు తీర్పునిచ్చారు. వాహనం ఖరీదు రూ.6,87,661, సేవా లోపం కలిగించినందుకు రూ.50 వేలు పరిహారం, ఖర్చులకు రూ.10 వేలును 15 రోజుల్లో ఇవ్వాలని బీమా కంపెనీని ఆదేశించారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఉమ్మడి విశాఖ జిల్లా నక్కపల్లి మండలం వేంపాడు గ్రామానికి చెందిన సబ్బు శ్రీను (35) విశాఖలోని విష్ణు క్యారియర్స్ ట్రాన్స్‌పోర్ట్స్ కంపెనీ దగ్గర టాటా ఎంట్రా వి 50 రవాణా వాహనాన్ని 2023 జనవరి 30 తేదీన కొనుగోలు చేశారు. ఈ వాహనానికి విశాఖ మహారాణిపేట పరిధిలోని గో డిజిటల్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో బీమా చేయించారు. వాహనానికి 2024 ఏప్రిల్ 30 వరకు బీమా సౌకర్యం ఉంది. 2023 ఏప్రిల్ 30 తేదీన ఈ వ్యాను ఝార్ఖండ్ రాష్ట్రంలోని వేమీడు గ్రామంలోని మామిడిపండ్లను ఎక్కించుకొని విశాఖ వస్తుండగా ఇచ్ఛాపురం నగరపాలక సంస్థ పరిధిలోని పురుషోత్తపురం చెక్‌పోస్టు దగ్గర ప్రమాదానికి గురైంది. వాహనం పూర్తిగా దెబ్బతినడంతో పాటు డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇచ్ఛాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వాహనం పూర్తిగా దెబ్బతిన్నందున తమకు డబ్బులు వాపస్ చేయాలని వాహనదారుడు శ్రీను ఇన్సూరెన్స్ కంపెనీని కోరాడు. బీమా కంపెనీ సర్వే కూడా నిర్వహించింది. ప్రమాదానికి సంబంధించి వాణిజ్య పరివర్తన ఏమీ లేదని, బీమా నిబంధన వర్తించదని ఇన్సూరెన్స్ కంపెనీ వాదనలు వినిపించారు. ఇరు వర్గాల వాదన విన్న కమిషన్ పైవిధంగా తీర్పునిచ్చారు.

ఇటీవల కొత్తగా వేసిన రహదారి

గుంతల రహదారికి మోక్షం

ప్రజాశక్తి-పెందుర్తి : పద్మనాభపురం మేఘాద్రి నుండి నరవ, జెర్రిపోతులపాలెం తదితర సుమారు 14 గ్రామాల రహదారికి మోక్షం లభించింది. రోజూ కొన్ని వందల మంది వాహనదారులు ప్రయాణం చేసే ఈ రహదారి గత దశాబ్ద కాలంగా అస్తవ్యస్తంగా ఉండేది. ప్రయాణానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం వస్తే రోడ్డు వేసే బాధ్యత తనదంటూ జనసేన సీనియర్ నాయకుడు గల్లా శ్రీనివాసరావు అప్పట్లో హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నెలల్లోనే ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు చొరవతో సుమారు రూ.కోటి వ్యయంతో బిటి.రోడ్డును వేశారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఘనంగా 'ప్రతిభకు పట్టాభిషేకం'

'ప్రతిభకు పట్టాభిషేకం' అవార్డులు అందిస్తున్న దాడి సత్యనారాయణ

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖకు చెందిన ప్రతిభా క్రీడా సాంస్కృతిక సంస్థ 25వ వార్షికోత్సవం సందర్భంగా రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని వివిధ రంగాల్లో నిష్ణాతులకు 'ప్రతిభకు పట్టాభిషేకం' పేరిట అవార్డులు బహుకరించారు. స్థానిక పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కళా రంగ ప్రముఖులు సన్‌మూర్తి, నాంచారయ్య, రమణి, మహేష్ బాబు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, కళా రంగంలో 25 ఏళ్ల ప్రస్థానంలో ప్రతిభా సంస్థ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని అనేక కార్యక్రమాలు నిర్వహించిందని తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులు అడవి రాజు నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ కొల్లూరు సత్యనారాయణ, తిరుపతి నాయుడు, గోపి నాయుడు, విజయరమణి, ఎం.శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్ పండ, సిక్కోలు సత్యం, అఖిల, కావ్య, శంకర్రావు తదితరులు అవార్డులు స్వీకరించారు. సభలో ఎంవి.సుబ్రమణ్యం, పి.ఎ.భాస్కర్, బైపల్లి సోమేష్, హేమసుందర్, శాస్త్రి, శివ జ్యోతి, శారద, శర్మ తదితరులు పాల్గొని ప్రతిభ సేవలను కొనియాడారు.

రుద్రాక్షగౌరీదేవికి డాక్టరేట్ అందిస్తున్న ఎయు విసి

రుద్రాక్ష గౌరీదేవికి డాక్టరేట్

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభ మండలం రేవిడి పంచాయతీ రౌతులపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ కోన రామకృష్ణ సతీమణి రుద్రాక్ష గౌరీదేవికి ఆంధ్ర విశ్వవిద్యాలయం, గ్రంథాలయ సమాచార శాస్త్ర విభాగంలో పరిశోధన చేసినందుకు డాక్టరేట్ పట్టా లభించింది. 'పాట్రాన్ అండ్ యూస్ ఆఫ్ ఆన్‌లైన్ రిసోర్స్ బై యూనివర్సిటీ స్టూడెంట్స్ ఫర్ అకాడమీ పర్పస్ ఎ స్టడీ' అంశంపై ఆమె పరిశోధన చేశారు. డాక్టరేట్‌ను విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాజశేఖర్ అందజేశారు. రుద్రాక్ష గౌరీదేవి తన పరిశోధనను ఆచార్య శశికళ, ధనరాజు పర్యవేక్షణలో చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సమాచార శాస్త్ర విభాగంలోని విద్యార్థులు, అధ్యాపకులు, సహాయక సిబ్బంది ఆమెను అభినందించారు. డాక్టరేట్ అందుకున్నందుకు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఆకర్షణీయంగా శిల్పారామం

ప్రజాశక్తి-మధురవాడ : పల్లె అందాలు ఉట్టిపడేలా సందర్శకుల మదిలో ఓ మధుర జ్ఞాపకంగా నిలిచిపోయే పర్యాటక ప్రదేశం మధురవాడ శిల్పారామం (జాతర). ఈ మనోహర ప్రదేశాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు శిల్పారామం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వివిధ బొమ్మలు, పలు ఆకృతుల రంగులు వెలిసి, బీటలు వారి వెలవెలబోతున్న వాటికి రంగులు అద్ది సందర్శకులను ఆకర్షించేలా పూర్వకళను తీసుకొస్తున్నారు. జాతర ప్రాంగణంలో పచ్చదనాన్ని సైతం పెంపొందించేందుకు అందమైన కుండీలు ఏర్పాటు చేశారు. అందులో పచ్చని అందమైన మొక్కలు నాటారు. మ్యూజియాన్ని అందంగా తీర్చిదిద్ది పూర్వకళను తీసుకొచ్చారు. రాత్రి పూట అందమైన వెలుగులు ప్రసరించేలా విద్యుత్తు దీపాలను అమర్చారు. ఇటీవల పరిపాలనాధికారిగా బాధ్యతలు చేపట్టిన రమేష్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని శిల్పారామాన్ని ఆకర్షణీయంగా తయారుచేస్తున్నారు.

రంగుల కుండీలతో పచ్చదనం

నిర్లక్ష్యంతో శిలాఫలకం శిథిలం

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి జోన్ 8 భవనం గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.50 లక్షలతో పూర్తి మరమత్తులు, నూతనంగా కొన్ని పనులు చేపట్టారు. నిధులు ఏయే శాఖ నుంచి కేటాయించారో తెలుపుతూ ప్రోటోకాల్ ప్రకారం శిలాఫలకాన్ని ఏర్పాటు చేస్తారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా శిలాఫలకాన్ని పట్టించుకోకుండా ఒక మూలన పడేయడంతో అది పూర్తిగా పగిలిపోయింది. ఈ శిలాఫలకాన్ని జోనల్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు చూసి ప్రభుత్వ నిధులు ఇలా వృథా అవుతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

శిథిలమైన శిలాఫలకం

ఎస్‌సి కాలనీలో అన్న సమారాధన

అన్న సమారాధనలో వడ్డిస్తున్న సాలాపు రామారావు

ప్రజాశక్తి -గాజువాక : వినాయక చవితి సందర్భంగా 72వ వార్డు పరిధి ఎస్‌సి కాలనీలో ఏర్పాటుచేసిన భారీ అన్న సమారాధనను టిడిపి సీనియర్ నాయకులు సాలాపు రామారావు ఆదివారం ప్రారంభించారు. భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కాలనీ ప్రెసిడెంట్ ఎం.రాజు, ఎం.వెంకట, పి.వరలక్ష్మి, కె.సుశీల, ఇ.దేవుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాల అమల్లో విఫలం

- వేధింపులు, దాడుల నియంత్రణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి
- ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి
- ఘనంగా అనకాపల్లి జిల్లా ఐదో మహాసభ

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

ప్రజాశక్తి- కశింకోట : మహిళా చట్టాల అమల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి విమర్శించారు. ఇప్పటికైనా చట్టాలను పకడ్బందీగా అమలు చేసి, బాలికలు, స్త్రీలపై వేధింపులు, దాడుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివారం కశింకోట పంచాయతీ కార్యాలయం దరి సామాజిక భవనంలో ఐద్వా అనకాపల్లి జిల్లా ఐదో మహాసభ ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఐద్వా ప్రతినిధులు, మహిళలు స్థానిక ఆర్‌టిసి బస్‌స్టాండ్ నుంచి జాతీయ రహదారి మీదుగా ర్యాలీగా మెయిన్ రోడ్డుకు చేరుకుని మహాసభ ప్రాంగణానికి చేరుకు న్నారు. సభా ప్రాంగణంలో సంఘం పతాకాన్ని ఆవిష్కరిం చారు. కళాకారులు ఆలపించిన ఉద్యమ గేయాలు చైతన్యం నింపాయి. అనంతరం జరిగిన మహాసభలో ప్రభావతి మాట్లాడుతూ దేశంలో 34 శాతం మహిళలు గృహహింసకు గురౌతున్నారని, ప్రతిరోజూ సగటున ఎనిమిది మంది మహిళలు, బాలికలు వేధింపులకు గురౌతున్నారని నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. వీటి నియంత్రణలో ప్రభుత్వ వైఫల్యం సరికాదన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపులతో అవమానంతో అనేక మంది ఆత్మహత్యలకు ఒడిగడు తున్నా చర్యల్లేక పోవడం దుర్మార్గమ న్నారు. వీటి నియంత్రణకు మరిన్ని చట్టాలను చేయడంతో పాటు వాటిని పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా స్త్రీశక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించినా, రద్దీకి తగ్గట్టుగా బస్సులు పెంచలేదని, అంతేకాక నేటికీ అనేక గ్రామాలకు ఆర్‌టిసి బస్ సౌకర్యం లేనందున ఈ పథకం ప్రయోజనం వారికి అందడంలేదని తెలిపారు. విద్యుత్ ఛార్జీలతోపాటు ఇతరత్రా అన్ని వస్తువులు, నిత్యావసరాల ధరలను విపరీతంగా పెంచేసి ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నారన్నారు. నామమాత్రంగా కొన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి మాట్లాడుతూ మహిళలు చైతన్యవంతులై తమపై దాడులు, వేధింపులను అడ్డుకోవడం తోపాటు హక్కులను సాధించు కోవాలన్నారు పేద ప్రజలకు విద్య, వైద్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందించాల న్నారు. మహాసభలో సంఘం జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, జిల్లా సహాయ కార్యదర్శులు ఆర్.లక్ష్మి, ఎల్.గౌరి, కోశాధికారి కెవి.సూర్యప్రభ, నాయకులు సిహెచ్. మంగతాయారు, యు.నాగమణి, బి.వాణి, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

తీర్మానాలివీ..

డ్వాక్రా రుణాల్లో అవినీతిని అరికట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అత్యాచారాలు, లైంగిక వేధింపుల నిరోధక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలను పూర్తిగా నిషేధించాలని, మహిళా సాధికారితకు అవసరమైన చర్యలు, చట్టాలను ప్రభుత్వపరంగా చేపట్టాలని కోరుతూ మహాసభలో పలు తీర్మానాలు చేశారు.

అధ్యక్ష, కార్యదర్శులుగా మాణిక్యం, వరలక్ష్మి

పి.మాణిక్యం

డిడి.వరలక్ష్మి

ఐద్వా మహాసభలో 17 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా పి.మాణిక్యం, కార్యదర్శిగా డిడి.వరలక్ష్మి, కోశాధికారిగా కెవి.సూర్యప్రభ, సహాయ కార్యదర్శులుగా ఆర్.లక్ష్మి, ఎల్.గౌరి సహా పలువురు జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

నేడు గండి బాబ్జి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి. సబ్బవరం : రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్, విశాఖపట్నం పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గండి బాబ్జి జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించేందుకు టిడిపి శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మొగలిపురం గ్రామంలో గండి బాబ్జి యువసేన ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు, మధ్యాహ్నం అన్న సమరాధన, అనాధాశ్రమము, వృద్ధుల ఆశ్రమంలో అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం బాబ్జి జన్మదిన వేడుకలు కేక్ కటింగ్ నిర్వహించి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల టిడిపి అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు తెలిపారు. మండల టిడిపి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పట్టుదలతో చదివితే విజయం

వేడుకలను ప్రారంభిస్తున్న ఎజిఎం రిషి, తదితరులు

ప్రజాశక్తి -సబ్బవరం : ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి, విజయం సాధించగలరని విజన్ ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ ఎజిఎం రిషి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోనిప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో విజన్ అకాడమీ ప్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా ఎజిఎం రిషి మాట్లాడుతూ సబ్బవరంలో కొత్తగా విజన్ ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ బ్రాంచ్ ప్రారంభించా మన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారికి మంచి ర్యాంకులు సాధించే దిశలో అధ్యాపకులు కషి చేయాలని కోరారు. రానున్న కాలంలో విజన్ అకాడమీ పేరు రాష్ట్ర నాలుమూలలా వ్యాపించేలా విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు .కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. గంగునాయుడు, ఎఒ పూడి రామేంద్రకుమార్, వైస్ ప్రిన్సిపాల్ స్వామి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

రైతు సేవా కేంద్రాల్లో అమూల్ కార్యకలాపాలు

రైతు సేవా కేంద్రంలో ఉన్న అమూల్ పాల కేంద్రం సామగ్రి

ప్రజాశక్తి -కోటవురట్ల : గత జగన్ ప్రభుత్వ హయాంలో అట్టహాసంగా ప్రవేశపెట్టిన గుజరాత్‌కు చెందిన అమూల్ పాల సంస్థ కార్యకలాపాలను ప్రభుత్వ కార్యాలయాల్లోనే కొనసాగడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పటో అమూల్ పాల కేంద్రాల ఏర్పాటుక్కు తాత్కాలికంగా సచివాలయ రైతు భరోసా కేంద్రాలను వినియోగించుకున్న సంగతి తెలిసిందే, అయితే నాటి నుంచి నేటి వరకు కూడా అమూల్ సంస్థ పాల కేంద్రాలను సచివాలయ రైతు భరోసా కేంద్రాల్లోనే నిర్వహించడం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. అమూల్ పాల సంస్థ నిర్వహిస్తున్న కేంద్రాలలో విద్యుత్ బిల్లులు సైతం సచివాలయాల రైతు భరోసా కేంద్రాలు చెల్లించాల్సిన పరిస్థితి పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుప్పిస్తున్నారు. అమూల్ పాల సంస్థపై అధికారులకు, నాయకులకు ఎందకంత మక్కువో అంతుచిక్కడం లేదని విమర్శలున్నాయి.

డిఎస్‌సిలో గ్రామీణ అభ్యర్థుల సత్తా

భార్గవ్

లావణ్య

ప్రజాశక్తి- కె.కోటపాడు : మెగా డిఎస్‌సిలో గ్రామీణ ప్రాంతం నుండి అర్హత సాధించి ఉపాధ్యాయులుగా ఎన్నికైన భార్గవ్, లావణ్యను పలువురు అభినందిస్తున్నారు. మండల కేంద్రం కే. కోటపాడు కు చెందిన కోసూరు భార్గవ్ రాష్ట్రస్థాయిలో 141వ ర్యాంకు సాధించి ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. అలాగే అదేవిధంగా మండలంలోని కిటంతాడ శివారు బొట్టవానిపాలెం గ్రామానికి చెందిన అంగి లావణ్య తొలి ప్రయత్నంలోనే ఉపాధ్యాయునిగా ఎంపికయింది. భర్త బోర పెదరమణ ఒక ప్రైవేట్ కాలేజీలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. 28న సర్టిఫికెట్ల పరిశీలన జరిగి, ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వీరు ప్రభుత్వం పోస్టింగులు అందుకోనున్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బండ్ల పరుగు పందేలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి నేరెళ్ల కల్లాలు వద్ద ఆదివారం వినాయక ఉత్సవాల సందర్భంగా జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పరుగు పందెం పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. వరసిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి రైతులు తమ ఎడ్లను అలంకరించి ప్రదర్శనకు తీసుకువచ్చారు. పందేలను వీక్షించేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. విజేతలకు మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు బహుమతులును అందజేశారుకార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బంధం అప్పలరాజు, వార్డు మెంబర్ దీవి శంకరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ వారాది దేవుళ్ల పాల్గొన్నారు.

శ్మశానంలోంచి రాకపోకలు

బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు
ఇదీ కలిగొట్ల జెడ్‌పిహెచ్‌ఎస్ దుస్థితి

శ్మశానం మధ్యలోంచి నడిచి వస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని కలిగొట్ల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బడికి వెళ్లాలన్నా, తిరిగి ఇళ్ల చేరాలన్నా అనునిత్యం శ్మశానవాటికలోంచి బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొనడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు డి వెంకన్న ఆక్షేపించారు. కలిగొట్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల సువిశాలమైన స్థలం, ఆహ్లాదకర వాతావరణంలో విద్య వెలుగులు వెదజల్లుతోందన్నారు. అయితే ఈ పాఠశాలకు వచ్చిపోయేందుకు ఉన్న మార్గం మాత్రం విద్యార్థులు, ఉపాధ్యాయులతోపాటు అటుగా వెళ్లే ప్రతిఒక్కరిలోనూ గుబులు పుట్టిస్తోందన్నారు. శ్మశానవాటిక మధ్యలోంచి ఉన్న మార్గంలో పాఠశాలకు వెళ్లి రావాల్సిన పరిస్థితులు దుర్భరమని వాపోతున్నారు. ఉదయం పూట పాఠశాలకు వెళ్లేటప్పుడు పగటిపూట కావడంతో అంతగా భయం అనిపించకపోయినా, సాయంత్రం పాఠశాల విడిచిన తర్వాత ఇదే మార్గంలో ఇళ్లకు రావాలంటే మాత్రం అందరూ గుండెల్ని బిక్కపట్టుకుని రావాల్సి వస్తోందని వాపోతున్నారు, ఒకరికొకరు తోడుగా, చేయిచేయి పట్టుకుని రావాల్సిన స్థితి ఇందుకు కారణమని వేరే చెప్పనక్కరలేదు. చీకటి పడితే చుట్టూ ఎవరూ కనిపించరు. గుబురుగాపెరిగిన పెద్దచెట్లు, రహదారి పక్కనే గుబురుగా పెరిగిన పిచ్చిమొక్కలు, మధ్యలో బురదమయమైన రోడ్డులో నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగించక తప్పడం లేదు. పెద్దలెవరైనా తోడు వచ్చిన రోజున ఊపిరి పీల్చుకుని శ్మశానమార్గాన్ని దాటిపోతుండగా, మిగిలిన రోజుల్లో మాత్రం భయాందోళనలతో వచ్చి పోవాల్సిందేనని వెంకన్న ఆక్షేపించారు. గ్రామంలో ఎంతో మంది మేధావులు, గుర్తింపు ఉన్న రాజకీయ నేతలు ఉన్నప్పటికీ ఇక్కడ పాఠశాలకు వెళ్లేమార్గం మాత్రం ఇలా భయానక పరిస్థితుల్లో ఉండడంపై విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు పలువురు ఆవేదన చెందుతున్నారు రాష్ట్రంలో మరే పాఠశాలకు లేనటువంటి భిన్నమైన పరిస్థితులు కలిగొట్ల లో నెలకొనడంపై వెంకన్న ఆవేదన వ్యక్తం చేస్తూ, దీనికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని వెంకన్న కోరారు.

రిటైర్డ్ ఎఇఇకి ఘన సత్కారం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : పంచాయతీరాజ్ మండల అసిస్టెంట్ ఇంజనీర్‌గా బాధ్యతలు నిర్వర్తించి ఆదివారం ఉద్యోగ విరమణ చేసిన కొండపల్లి ప్రభు శ్రీనివాస్‌ను స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల నాయకులు అధికారులు ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి దాకారపు నాగేశ్వరి దేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెలు సత్యనారాయణ, ఎంపిడిఒ భానోజీరావు, టిడిపి మండల అధ్యక్షులు ఎంవివి సత్యనారాయణ తమరాన దాసు, కోటా సత్యనారాయణ, డొంకిన అప్పలనాయుడు, గోకవాడ కోటేశ్వరరావు, డిఎస్‌నాయుడు, ఎపిఒ వరహాలు బాబు పాల్గొన్నారు.

కనీస వేతనాల అమలుకు పోరాటం

ఆశా కార్యకర్తల ఏడో జిల్లా మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి- అనకాపల్లి : కనీస వేతనాల అమలుకు ఆశా వర్కర్లు పోరాటాలకు సిద్ధం కావాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధనలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం అనకాపల్లి దొడ్డి రాము నాయుడు భవనంలో జిల్లా అధ్యక్షురాలు కె శాంతి, కే .వరలక్ష్మి అధ్యక్షతన ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు అనకాపల్లి జిల్లా ఏడవ మహాసభ నిర్వహించారు. ముందుగా సంఘం జెండాను జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.పార్వతి నివేదికను ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ ఇరవై ఏళ్లుగా ఆశా కార్యకర్తలు చాలీచాలని జీతాలతో పని చేస్తున్నారన్నారు. ఎటువంటి వేతనాలు లేని స్థితి నుంచి నేడు గౌరవ వేతనాలను సాధించుకున్న ఆశాలు, మున్ముందు కనీస వేతనాలు అమలుకు సమిష్టి పోరాటానికి సిద్ధం కావాలన్నారు. గ్రామాల్లో ప్రజలను సేవ చేయాల్సిన ఆశాలను రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరోగ్యకేంద్రాలకు వచ్చి ఉండాలని అధికారులు ఒత్తిడి చేయడం దుర్మార్గమన్నారు. సబ్‌సెంటర్లు, పిహెచ్‌సిల్లో పరిశుభ్రతా పనులకు ఆశాలను వినియోగించడం సరికాదన్నారు. గర్భిణులు, బాలింతలు, రోగులకు వైద్యసేవల్లో సహకరించాల్సిన ఆశాలను ఇలా క్లీనింగ్ పనులతో వెట్టిచాకిరీ చేయించడం వల్ల ఆశించిన లక్ష్యం నెరవేరే పరిస్థితి లేదన్నారు.కోవిడ్ కాలంలో ఆశా కార్యకర్తల సేవలను ప్రపంచమంతా గుర్తించినా, పాలక ప్రభుత్వాలకు వీరి కష్టం కనబడకపోవడం శోచనీయమన్నారు. గ్రామాల్లో రాజకీయ జోక్యం, ఒత్తిళ్లలో ఆశాలు వేధింపులకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యవసరాల ధరలు, కుటుంబ నిర్వహణ వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుని ఆశాలకు కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మెడలు వంచి, ఆశాల హక్కులు, డిమాండ్ల సాధనకు భవిష్యత్తు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలతో కార్మికులపై విపరీతమైన భారాలు పడుతున్నాయని, కార్మిక చట్టాలను రద్దు చేసి, కోడ్‌లుగా మార్చడం ద్వారా హక్కులను హరించడం దుర్మార్గమన్నారు. ఎన్నికలకు ముందు ఆశా వర్కర్ల ఆందోళన సమయంలో కనీస వేతనాలను అమలు చేసి, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చిన టిడిపి, కూటమి నేతలు నేటికీ అమలు చేయకపోవడం సరికాదన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ ఆఫీస్ బేరర్స్ బి సత్యవతి, కె. వరలక్ష్మి, బి.రామలక్ష్మి, ఎం సూర్య కళ, అరుణ, రాజ్యలక్ష్మి, కెలక్ష్మీ పాల్గొన్నారు.

స్త్రీశక్తితో మహిళలకు భరోసా

ఎమ్మెల్యే రాజును సత్కరిస్తున్న మహిళలు

ప్రజాశక్తి -చోడవరం : ఎన్నికల హామీల అమలులో కూటమి సర్కార్ సఫలీకృతమైందని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. ఆదివారం చోడవరంలో స్త్రీశక్తి ద్వారా లబ్ధి పొందుతున్న మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కటొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంకల్పించామని, రానున్న రోజుల్లో 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు రూ.1500 అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి మహిళలకు కూటమి ప్రభుత్వం భరోసాగా ఉంటుందన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు మాట్లాడుతూ సంక్షేమం అభివృద్ధి రెండు ఎక్కడా డోకా లేకుండా చంద్రబాబు ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజును మహిళలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లు నాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు కనిశెట్టి సన్యాసిరావు, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొడ్డేట నాగ గంగాధర్, పార్టీ మండలఅధ్యక్షులు రాజానకొండ నాయుడు, ఎం వి సత్యనారాయణ, పూతి కోటేశ్వరరావు, ఎంపీటీసీ కొట్టపు రూపా దేవి, స్వయంభు విఘ్నేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు

'స్టాప్ అండ్ ఫేస్ వాష్'

డ్రైవర్‌తో ముఖం కడిగిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించి, ప్రజల ప్రాణ రక్షణ, భద్రతను కాపాడే లక్ష్యంతో రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా పర్యవేక్షణలో అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ స్టాప్ అండ్ ఫేస్ వాష్" కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నారు. రాత్రి వేళల్లో నిద్రలేమి కారణంగా జరిగే ప్రమాదాలను నివారించేందుకు, జిల్లా జాతీయ రహదారులపై ఉన్న 9 హైవే మొబైల్ టీమ్‌లు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లు నడిపే డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి, అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని సూచిస్తున్నారు. అలాగే, వాహనం నడిపేటప్పుడు తమ కుటుంబ సభ్యుల భద్రత గురించి ఆలోచించి జాగ్రత్తలు తీసుకోవాలని డ్రైవర్లకు పోలీసు అధికారులు సలహా ఇస్తున్నారు .ఇక, ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకునే బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు, లైటింగ్, ఇసుక డ్రమ్ములు ఏర్పాటు చేసి, విజిబుల్ పోలీసింగ్ ద్వారా రోడ్డు వినియోగదారులను అప్రమత్తం చేస్తున్నారు. ఈ చర్యల వల్ల ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా తెలిపారు. పోలీస్ కంట్రోల్ రూమ్ సిఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో హైవే మొబైల్స్ ప్రతిరోజూ పర్యవేక్షణ, తనిఖీలు చేసి రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేస్తున్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశకి-అనకాపల్లి రూరల్: దేశంలో కోటి సభ్యత్వాలున్న ఏకైక ప్రాంతీయ పార్టీ టిడిపి అని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం అనకాపల్లి నూకాలమ్మను దర్శించుకున్నారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 21 మందికి రూ.12 లక్షల చెక్కులను అందజేశారు .రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గోవింద్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు , ఉమ్మడి విశాఖ జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ అంటే ఏంటో తెలియదన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఇస్తున్నామన్నారు.

గరిష్టస్థాయికి జలాశయ నీటి మట్టం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని రైవాడ జలాశయంలో నీటి మట్టం గణనీయంగా పెరుగుతుంది. జలాశయం గరిష్ట నీటి మట్టం 114.00 మీటర్లుగా కాగా, ఆదివారం నాటికి 113.45 మీటర్ల వద్ద నమోదైంది. మరో 15 సెంటీమీటర్ల మేర నీటి మట్టం పెరిగితే స్పిల్‌వే గేట్లు తెరచి శారదా నదిలోకి నీటిని విడుదల చేసే అవకాశం ఉందని జలాశయ డిఇఇ సత్యం నాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో జలాశయం దిగువన నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఇన్ ఫ్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు.

డ్రోన్ కెమెరా నిఘాలో ఉత్సవ పర్యవేక్షణ

ప్రజాశక్తి - వడ్డాది : వినాయక ఉత్సవాలలో శాంతి భద్రత పర్యవేక్షణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు స్థానిక ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు బుచ్చయ్యపేట మండలం వడ్డాది పరిసర ప్రాంతాల్లో ఆదివారం డ్రోన్ కెమెరాతో వినాయక మండపాలు, అక్కడ జరుగుతున్న వేడుకలను పర్యవేక్షించారు ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రోన్ కెమెరా సహాయంతోనే వినాయక ఉత్సవాలపై నిఘా పెట్టామన్నారు. బహిరంగ ప్రదేశాలలో మందుబాబులు ఆగడాలను అరికట్టేందుకు టెక్నాలజీ వాడుకుంటున్నట్లు తెలిపారు. వినాయక ఉత్సవాల్లో అసాంఘిక కార్యకలాపాలు, తగాదాలకు తావు లేకుండా పర్యవేక్షిస్తామన్నారు. వడ్డాది జంక్షన్ బ్రిడ్జిపైన గ్రామ పరిసరాల్లో ఉన్న వినాయక మండపాలను డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

యూరియా సరఫరాలో ఘోర విఫలం

మాట్లాడుతున్న రైతు సంఘం నేత

ప్రజాశక్తి- ఎస్ రాయవరం : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సరిపడా యూరియా, ఇతర ఎరువులు సరఫరా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు ఆరోపించారు. వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి, రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్‌ల ద్వారా రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో పి ధర్మవరం గ్రామంలో రైతుల పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్లో 1,35,000 ఎకరాలలో వరినాట్లు వేస్తారని, ప్రస్తుతం వర్షాలు సమద్ధిగా సక్రమంగా పడకపోవడం వలన 50 వేల ఎకరాల్లో మాత్రమే రైతులు వరినాట్లు వేసారన్నారు. అయినా పంటకు సరిపడా యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని మండిపడ్డారు. ప్రభుత్వానికి వ్యవసాయక విధానం, ఖరీఫ్, రబీ సీజన్‌ల వారీగా ముందస్తు ప్రణాళిక లేదని, దాని కారణంగానే యూరియా సరఫరా చేయడంలో తీవ్రంగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

గంగవరం పోర్టులో ఎనబై వేలు మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందని, గొడౌన్లలో యూరియా అందుబాటులో ఉందని, నానో యూరియా పిచికారీ చేయమనిమంత్రులు, అధికారులు పొంతన లేని ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. అందుబాటులో యూరియా ఉంటే ఎందుకు రైతులకు సరిపడా సరఫరా చేయడం లేదని ప్రశ్నించారు, ప్రభుత్వం, అధికారులు ప్రైవేట్ వ్యాపారులతో సిండికేట్ అయిపోయి యూరియా ప్రైవేటు ఏజెన్సీలకు సరఫరా చేసి, యూరియా కృత్రిమ కొరత సృష్టించి రైతులను దోపిడీ చేస్తున్నారని తెలిపారు, ప్రభుత్వం దగ్గర లేని యూరియా ప్రైవేటు వ్యాపారుల దగ్గర ఎలా వస్తుందని ప్రశ్నించారు. అన్నదాతలను దగా చేయడం దుర్మార్గమని, ఇప్పటికైనా సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు శ్రీపాదుల గోవిందరావు,కుక్కులూరి వెంకట రమణ,కర్రి నాగ సంజీవ్, శీరం సాయి పాల్గొన్నారు

టిడిఆర్ అభ్యంతరాలపై గందరగోళం

ప్రజాశక్తి- మునగపాక: అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ బాధితులతో విఎంఆర్‌డిఎ ఆటలాడుకోవడం తగదని నిర్వాసిత సంఘ నాయకులు ఎస్ బ్రహ్మాజీ ఆరోపించారు. ఆదివారం స్థానిక పిఎసిఎస్ ఆవరణలో నిర్వాసితులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శనివారం 30న వాట్సాప్ ద్వారా తేదీ లేకుండా నెల, సంవత్సరం(08/2025) నోటీసులో పొందుపరుస్తూ నిర్వాసితులు నోటీసులు సమాచారం పంపి, టిడిఆర్‌లపై అభ్యంతరాలుంటే వారం రోజుల్లోగా తెలియచేయాలని ప్రకటన ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ తేదీన, ఏ రోజున అభ్యంతరాలు తెలియజేసుకోవాలో తెలియక నిర్వాసితులు గందరగోళంలో ఉన్నారని విమర్శించారు. నిర్వాసితులను సమాచార లోపంతో మోసం చేయడాన్ని నిర్వాసితుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం, పునరావాసం కల్పించాలని, గజానికి రూ..25 వేలు పరిహారం చెల్లించాలని, ఆర్అండ్‌బిలో నిర్మాణాలు పోతున్న వ్యాపారులకు నాలుగు రెట్లు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిర్వాసితులు ఆడారి శ్రీనివాస నాయుడు, పోలమర శెట్టి అప్పలనాయుడు, విల్లూరు జగన్నాథరావు, పెంటకోట ఆదినారాయణ నాయుడు, బొడ్డెడ జగ్గారావు, ఆడారి జగన్నాథరావు పాల్గొన్నారు.

విఎంఆర్‌డిఎ నోటీస్ వెనక్కి తీసుకోవాలి

అచ్యుతాపురం : టిడిఆర్ బాండ్లపై రోడ్డు విస్తరణ నిర్వాసితులకు విఎంఆర్‌డిఎ ఇచ్చిన పబ్లిక్ నోటీసును వెనక్కు తీసుకోవాలని నిర్వాసితుల సంఘం కన్వీనర్ కె.రామ సదాశివరావు, కన్వీనర్ ఆర్ రాము డిమాండ్ చేశారు. టిడిఆర్ అభ్యంతరాలపై వెబ్‌సైట్‌లో తేదీ, ఇతరత్రా సమగ్ర సమాచారం లేకుండా పెట్టారన్నారు.

అచ్యుతాపురంలో మాట్లాడుతున్న నిర్వాసితుల సంఘం నేత

మునగపాకలో నిరసన వ్యక్తం చేస్తున్న నిర్వాసితుల సంఘం

టిడిఆర్ బాండ్లు వద్దని గ్రామసభల్లో నిర్వాసితులంతా ముక్తకంఠంతో వ్యతిరేకత వ్యక్తం చేయడంతోపాటు భూసేకరణ అధికారులకు వినతిపత్రాలు ఇప్పటికే అందజేశారని, ఇపుడు అభ్యంతరాలుంటే తెలియజేయాలని నోటీసు జారీ చేయడమేంటో అంతుపట్టడం లేదన్నారు. టిడిఆర్ పేరుతో నిర్వాసితులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో టిడిఆర్‌కు అంగీక రించే ప్రసక్తి లేదని, భూములు, స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు చేపట్టాలని కోరారు. నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్ రాము, రైతు సంఘం అధ్యక్షులు కర్రి అప్పారావు, ఎస్ బ్రహ్మాజీ, బుద్ధ రంగారావు, బి రామ్ కుమార్, నిర్వాసితులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు

▸▸ అధిక పెట్టుబడులతో సతమతమవుతున్న రైతులు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ముమ్మరంగా వరి నాట్లు సాగుతున్నాయి. మండలంలో వరి సాధారణ సాగు 4350 ఎకరాలు కాగా, ఇప్పటివరకు 3200 ఎకరాల్లో వరి ఉడుపులు పూర్తయ్యాయి. వర్షా భావ పరిస్థితులు అనుకూలించక పోవడంతో మండలంలో వరి నాట్లు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. వర్షాలు సకాలంలో పడి ఉంటే జులై నెలాఖరు లేదా ఆగస్టు మొదటి వారానికల్లా వరి నాట్లు పూర్తయి ఉండేవి.

ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచే వరుణుడు ముఖం చాటేయడంతో, అన్నదాతకు సాగునీటి ఇబ్బందులు తప్పలేదు. ఇటీవలా వర్షం కురవడంతో వరి నాట్లు ఊపందుకున్నాయి.మండలంలోని నక్కపల్లి, ఉపమాక ,కాగిత, ఉద్దండ పురం, గొడిచెర్ల, దొంకాడ ,వేంపాడు,

వరి నాట్లు వేస్తున్న కూలీలు

వరి నాట్లు వేసిన మడి

ముకుంద రాజుపేట, రమణయ్యపేట, దోసలపాడు, గుల్లిపాడు, జి.జగన్నాధపురం, దేవవరం, చిన రామభద్రపురం తదితర గ్రామాల్లో చాలావరకు ఉడుపులు పూర్తయ్యాయి. రైతులందరూ ఒకేసారి ఉడుపులు ప్రారంభించడంతో కూలీలు దొరక్క రైతులు ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో వరి ఆకు ఎండిపోవడంతో, ఆకు కొరత ఏర్పడింది. పలువురు రైతుల దగ్గర మిగిలి ఉన్న వరి ఆకును కొనుగోలు చేసుకుని మిగిలిన రైతులు ఉడుపులు చేపట్టారు.

పూర్తిగా వర్షాధారమే ఆధారం

మండలంలో వర్షాలు సమృద్ధిగా కురవక పోవడంతో ఇప్పటికీ పలు గ్రామాల్లో రైతులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. పలు గ్రామాల్లో బోర్ల ద్వారా పొలాలకు నీరు పెట్టి, ఉడుపులు సాగించారు. వరి మడులకు తడుపులు పెట్టడం, ఎరువులు వేయడంతో ఈ ఏడాది వరి సాగు ఆరంభం నుంచి రైతన్నకు అధిక పెట్టుబడుల భారమైంది. దీంతో రైతులు సతమతమవుతున్నారు.

కుంగిన వంతెనతో.. రవాణా కష్టాలు

▸▸ పది గ్రామాలకు నిలిచిన రాకపోకలు

▸▸ అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు

▸▸ తక్షణ మరమ్మతులు చేపట్టాలని వినతి

ప్రజాశక్తి - చీడికాడ : రెండు మండలాలకు అనుసంధానంగా ఉన్న వంతెన కుంగిపోవడంతో పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి దీంతో ఆయా గ్రామస్తులు తమ గమ్యాలను చేరుకోవాలంటే పది నుంచి 15 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది

చీడికాడ మండలంలోని కట్టవాని అగ్రహారం సమీపాన బొడ్డేరుపై 15ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన ఇటీవలవర్షాలకు కుంగిపోయింది. వంతెనకు సంబంధించి ఒక పిల్లర్ కుంగడంతో వంతెన పైనుంచి రాకపోకలను నిలుపుదల చేశారు. దీంతో కట్టవాని అగ్రహారం, దిబ్బపాలెం, దండి సరవరం, తునివలస, ఇంటి పాలెం, బైలపూడి, అడవి అగ్రహారం మొదలగు గ్రామాల ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఆయా గ్రామస్తులు సమీపానే ఉన్న వడ్డాది వెళ్లాలంటే చుట్టూ తిరిగి 15 కిలోమీటర్లు దూరం అదనంగా ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఇదే సమస్యతో దాదాపు 15ఏళ్ల క్రితం అప్పటి టిడిపి జిల్లా ఇన్‌ఛార్జి గవిరెడ్డి రామానాయుడు ఈ ప్రాంత ప్రజల రాకపోకల కష్టాలను దృష్టిలో పెట్టుకుని బొడ్డేరు వద్ద వంతెన నిర్మాణ ఆవశ్యకతను అప్పటి విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి, డెయిరీ సిఎస్ఆర్ నిధులను మంజూరు చేయగా, 2010లో పనులను ప్రారంభించి, శరవేగంగా నిర్మాణం చేపట్టి, ఏడాదిలోపే 2011లో వంతెన పూర్తిచేశారు. దీంతో తమ రాకపోకల కష్టాలు తొలగిపోయాయని ఈ ప్రాంతీయులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. పదికాలాల పాటు ఉండాల్సిన వంతెన, కేవలం 15ఏళ్లకే కుంగిపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణానికి పిల్లర్లు వేయకుండా ఐదు అడుగుల లోతు తవ్వి కాంక్రీట్ దిమ్మ వేసి దానిపై వంతెన నిర్మాణం చేపట్టారని సమీప గ్రామస్తులు అంటున్నారు. బ్రిడ్జి సమీపంలో నిత్యం రేయింబవళ్లు ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపట్టడం వల్లే దానికి ఆనుకుని ఉన్న పునాదుల కిందన మట్టి కుంగిపోయి దాంతో పాటు వంతెన పిల్లర్లు భూమిలోకి దిగబడ్డాయని స్థానికులు అంటున్నారు. .ఇప్పటికే వంతెనపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే ప్రమాదమని హెచ్చరించినా పట్టించుకోకపోవడం కూడా మరో కారణమని అంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీటి ప్రవాహం అధికమై ఇసుక కోత గురై బ్రిడ్జి పిల్లర్లు కుంగిపోయి ప్రస్తుతం ఈ పరిస్థితికి కారణ మయ్యాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వంతెన దుస్థితిని అనేకసార్లు ఈ

కుంగిన వంతెన పిల్లర్

వంతెనపైకి వెళ్లకుండా అడ్డుగా వేసిన మట్టి

ప్రాంతీయులు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తితోపాటు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా తగు రీతిలో స్పందించకపోవడం వల్లే ఇపుడు ఏకంగా వంతెనపై రాకపోకలకు వీలులేనంతగా పాడైందని వాపోతున్నారు. కుంగిపోయిన వంతెనకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి, చిరువాహనాలైనా రాకపోకలు సాగించేలా తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే రాకపోకల సమస్యకు శాశ్వత పరిష్కారంగా మరో వంతెన పునర్నిర్మాణం చేయాలని వేడుకుంటున్నారు. కాగా వంతెన పిల్లర్లుతోపాటు పైకప్పు కుంగిపోవడంతో పొంచి ఉన్న ప్రమాదంపై చీడికాడ తహశీల్దార్ కిషోర్‌లింకన్, ఎస్ఐ బి.సతీష్ వెంటనే స్పందించారు. వంతెనపై రాకపోకలను నిలుపుదల చేస్తూ, ఇరువైపులా అడ్డుగా మట్టిదిబ్బలను వేసి, హెచ్చరిక బోర్డులను, ముళ్ల కంపలను ఏర్పాటు చేసి రాకపోకలను నిలుపుదల చేశారు. వంతెన కుంగిపోవడంతో మళ్లీ తమకు పాత కష్టాలు దాపురించాయని ఈ ప్రాంతీయులు ఆవేదన చెందుతున్నారు.

పుస్తకాలను చూపుతున్న గ్రంథాలయాధికారి

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయధికారిణి పి.దమయంతి ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమంను నిర్వహించారు. పిల్లలచేత నీతి కథలు చదివించారు. గ్రంథాలయంలో పుస్తకాలను విద్యార్థులకు పరిచయం చేశారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ పిల్లలకు హరికథలపై వివరించారు.

హాజరైన టిడిపి నేతలు

రక్తదాన శిబిరాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-నాతవరం:స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ మాట్లాడుతూ, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జన్మదినం సందర్భంగా ఈనెల 4న సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ, స్పీకర్ జన్మదినం సందర్భంగా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేస్తామని, నాయకులు కార్యకర్తలు, యూత్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర యస్.సి కార్పొరేషన్ డైరెక్టర్ కొంద్రు మరిడియ్య, మండల పిఏసియస్ అధ్యక్షులు సింగంపల్లి సన్యాసిదేముడు దేముడు, అపిరెడ్డి మాణిక్యం, తాండవ డిసి మెంబర్ పారుపల్లి దాసు, మండల మహిళా అధ్యక్షురాలు ఇనపనప్పల సత్యవతి, మాజీ ఎంపిపి నేతల విజయ్ కుమార్, నాతవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు పైల సూరిబాబు, యర్రా కాశీ, మండల ఐ.టిడిపి కన్వీనర్ శెట్టి గోపి, రమణ, జీవి రెడ్డి రాజుబాబు, సీతారాం పాల్గొన్నారు. **గొలుగొండ:**జనసేన అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గొలుగొండ మండలం పాతకృష్ణదేవిపేట గ్రామంలో ఈనె 1వ తేదీన మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు దుంపలపూడి సహదేముడు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ముందుగా తమ పేర్లను 9182528415, 6309565689 నంబర్లకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని చెప్పారు.

కొబ్బరి మొక్కలు నాటివేత

ప్రజాశక్తి - రావికమతం: మండలంలో కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమారి ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్ దాసరి వరహాలు ఆదివారం కొబ్బరి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, మూడు ఏళ్ల క్రితం అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా బుడ్డి బంద నుంచి కవగుంట వరకు పలు రకాల మొక్కలను రోడ్డు కిరువైపులా సుమారు 400 మొక్కలను నాటడం జరిగిందన్నారు. . వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో కొబ్బరి మొక్కలు ఏపుగా ఎదగడలకు వస్తున్నాయన్నారు. మొక్కలు నాటడంతో అవి నీడను ఇవ్వడంతోపాటు, కాలుష్య నివారణకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

మొక్కను వేస్తున్న వరహాలు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

మహిళల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - చీడికాడ: మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, స్వయం శక్తితో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం చావడి వద్ద నియోజవర్గ స్థాయి స్త్రీ శక్తి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్థానిక శివాలయం నుండి భారీ ర్యాలీతో సభ వేదిక వద్దకు చేరుకున్నారు. నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు గవిరెడ్డి రామానాయుడు, మాజీ జెడ్పిటిసి పి.రవణమ్మ, మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, మాజీ జలాశయం చైర్మన్ జి ముసలి నాయుడు పాల్గొన్నారు.

హాస్టల్ భవనం వద్ద నిలిచిన మురుగునీరు

దుర్గంధం నడుమ వసతిగృహం

ప్రజాశక్తి-నర్సీపట్నం: నర్సీపట్నంలోని జిటి డబ్ల్యూ గర్ల్స్ 1 హాస్టల్ సమీపంలో అపారిశుధ్యానికి అడ్డాగా దర్శనమిస్తుంది. దీంతో హాస్టల్లో ఉండే విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సమీపంలో గల కాలనీవాసులు చెత్తను హాస్టల్ సమీపంలో వేయడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి వెనుక ఉన్న గచ్చపు వీధి, శివపురం కాలువ మురుగునీరంతా హాస్టల్ వెనుక భాగం నుండి ప్రవహిస్తోంది. కాలువలో మురుగు పేరుకు పోవడంతో దోమల బెడద తో పాటు దుర్వాసన కూడా అధికంగా ఉంటుందని విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుకుంటున్నారు.

అవార్డులు అందుకుంటున్న రాజుబాబు, చిరంజీవి

సేవారత్న అవార్డులు ప్రదానం

ప్రజాశక్తి-గొలుగొండ: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గొలుగొండ మండలానికి చెందిన ప్రజా సంకల్ప వేదిక ప్రతినిధులు వాడపల్లి రాజుబాబు, నెల్లూరి చిరంజీవి ఆదివారం విశాఖపట్నంలో జరిగిన ఉత్తరాంధ్ర విస్తృత స్థాయి సమావేశంలో ఉత్తమ సేవారత్న అవార్డును అందుకున్నారు. ప్రజాసంకల్ప వేదిక జాతీయ అధ్యక్షులు మదిరే రంగసాయిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు జక్కు నరసింహమూర్తి చేతుల మీదుగా వీరు ఈ అవార్డును అందుకున్నారు. నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు వీరికి అభినందనలు తెలిపారు.

పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

76 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని ఆర్. భీమవరం, చిన్న భీమవరం గ్రామాల్లో తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. 76 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

జాతీయ మత్స్యకార సంఘం మండల అధ్యక్షులుగా అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో అమలాపురం గ్రామానికి చెందిన ఎరిపిల్లి అప్పలరాజు జాతీయ మత్స్యకార సంఘం నక్కపల్లి మండలం అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ మేరకు నక్కపల్లిలో నూకాలమ్మ ఆలయం వద్ద ఆదివారం జాతీయ మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు చేతులు మీదుగా నియామక పత్రాన్ని ఎరిపిల్లి అప్పలరాజుకు అందజేసి, ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన అప్పలరాజును అమలాపురం పంచాయతీ సర్పంచ్ పెదపూడి శంకర్రావు, నాయకులు గోవిందు, నరసింగరావు శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మత్స్యకార సంఘం ఉత్తరాంధ్ర ఇంచార్జ్ పిక్కి కొర్లయ్య, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కొవిరి వెంకటేష్,వర్కింగ్ అధ్యక్షులు ఎం.జగ్గారావు,అమ్మోరియ్య, సత్యం, బాబ్జీ,గోపి తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు

కార్మికపక్ష నేత ఢిల్లీరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కార్మిక వర్గ సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతగా పనిచేసి, కడవరకూ కార్మికుల పక్షాన నిలబడిన నేత బి.ఢిల్లీరావు అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. ఢిల్లీరావు సంస్మరణ సభ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో పార్టీ నాయకులు ఎం.రాంబాబు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఢిల్లీరావు చిత్ర పటానికి పార్టీ సీనియర్ నాయకులు పెతకంశెట్టి వెంకటరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జగ్గునాయుడు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు నిలబడిన వ్యక్తి ఢిల్లీరావు అని కొనియాడారు. మల్కాపురం ప్రాంతంలో నివాసం ఉంటూ సెక్యూరిటీ గార్డుగా వృత్తి చేసుకొని సిఐటియు, యువజన సంఘం సభ్యునిగా జాయిన్ అయ్యారని తెలిపారు. చింతల్లోవలో యువజన సంఘాలు పెట్టి ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి చేశారన్నారు. క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని, పార్టీ ఏది ఆదేశిస్తే అదే పాటించేవారని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, అనారోగ్య సమస్యలు ఉన్నా ఏనాడూ ప్రజాసేవకు దూరం కాలేదన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ఎక్కడికి వెళ్లాలంటే అక్కడికి వెళ్లి పనిచేసే వారన్నారు. సిఐటియు స్టీల్ జోన్ కార్యదర్శి బాధ్యతలు చేపట్టి పని చేశారన్నారు. గంగవరం పోర్టు నిర్వాసితులు, స్టీల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జరిగిన పోరాటాలకు నాయకత్వం వహించారని తెలిపారు. కార్మిక రాజ్యం రావాలని, దోపిడీ రహిత సమాజ ఆశయం కోసం పనిచేశారని చెప్పారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. సభలో పార్టీ జిల్లా నాయకులు బి.పద్మ, బి.జగన్, బి.ఈశ్వరమ్మ, బి.వెంకటరావు, వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జగ్గునాయుడు తదితరులు

బీచ్ కబడ్డీ లీగ్ విజేత చంద్రంపాలెం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బీచ్ కబడ్డీ లీగ్ విజేతగా విశాఖలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. పికెఎల్ సీజన్ 12లో ప్రారంభ ఆటకు ముందు వైజాగ్‌లోని పాఠశాలల కోసం బెంగాల్ వారియర్స్ ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. బీచ్ కబడ్డీ లీగ్ నిర్వహించింది. ఈ పోటీలు ఆర్‌కె బీచ్‌లో జరిగాయి. తుదకు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాలురు, బాలికల విభాగాల్లో విజేతగా నిలిచారు. విశాఖ నలుమూలల నుంచి 3 వేల మంది ఈ లీగ్‌లో పాల్గొన్నారు. ట్రోఫీ ప్రదానోత్సవ కార్యక్రమంలో కాంటాక్ట్ స్పోర్ట్స్, క్యాప్రి స్పోర్ట్స్ డైరెక్టర్, బెంగాల్ వారియర్స్ కెప్టెన్ దేవంక్ దలాల్, ప్రధాన కోచ్ నవీన్ కుమార్, బెంగాల్ వారియర్స్‌కు చెందిన జాంగ్ కున్ లీ, విశ్వాస్ పాల్గొన్నారు.